నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 4 జూలై 2024 | RANGAREDDY




# కార్యకర్తలకు అండగా ఉంటాం

**పార్టీ కోసం కష్టపడే వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలొస్తాయి**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**కేటీఆర్‌ను కలిసిన షాబాద్ జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, క్యామ మల్లేశ్**

షాబాద్, జూలై 3: బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని, కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు క్యామ మల్లేశ్ తదితరులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన కేటీఆర్...పార్టీలో కష్టపడి పనిచేసే నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎంతో పటిష్టంగా ఉన్నదని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో చేవెళ్ల నియోజకవర్గం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందినట్లు వివరించారు. అ ప్రాంతానికి చెందిన అవినాశ్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డిలాంటి యువ నాయకులకు మంచి భవిష్యత్తు ఉన్నదని, పార్టీ కోసం మరింత కష్టపడాలని సూచించారు. త్వరలో నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

## జీహెచ్ఎంసీకి ఈవీడీఎం శాఖలు బదిలీ





సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ, ఈవీడీఎంల మధ్య నెలకొన్న సమన్వయ లోపానికి శుభం కార్డు పడింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా)ను ప్రభుత్వం ఏర్పాటు చేయగా, ఏవీ రంగనాథ్ సారథ్యంలో ఈ విభాగం పనిచేయనున్నది. అయితే ఈవీడీఎం పరిధిలో ఉన్న అడ్వర్టయిజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్టు శాఖలను జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తూ బుధవారం కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విభాగాలకు అదనపు కమిషనర్లను నియమించగా, ప్రకటన విభాగం అదనపు కమిషనర్‌గా కె. సత్యనారాయణ, ట్రాన్స్‌పోర్టుకు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. శానిటేషన్ (హెల్త్) బాధ్యతలు పంకజకు అప్పగించారు.

# చేవెళ్ల కాంగ్రెస్‌లో చిచ్చు..

**యాదయ్య చేరికతో..**

- శంకుస్థాపన, ప్రారంభాలకు యాదయ్య రావొద్దని కాంగ్రెస్ నేతల నిరసనలు
- పోలీసుల ఎదుటే నవాబుపేట మండలంలో శిలాఫలకాలు ధ్వంసం
- నియోజకవర్గం అంతటా వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ క్యాడర్



నవాబ్‌పేట మండలం తిమ్మారెడ్డిపల్లిలో శిలాఫలకాన్ని కూల్చివేస్తున్న కాంగ్రెస్ నేతలు

నవాబుపేట, జూలై 3: బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను సొంత పార్టీ నేతలే అడుగడుగునా అడ్డుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు మొదలుకొని మండల స్థాయి నేతలు, కార్యకర్తలందరూ కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సంప్రదింపులతో యాదయ్య కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడంతో.. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మనోహర్‌రెడ్డితోపాటు యాదయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తమకు తెలియకుండా పార్టీలోకి తీసుకువచ్చేంత పెద్దోళ్లు అయింద్రా అంటూ మహేందర్‌రెడ్డి బాహాటంగానే అన్నట్లు ప్రచారం జరుగుతున్నది. అంతేకాకుండా యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరికపై మహేందర్‌రెడ్డి గుర్రుగా ఉన్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా జోరుగా ప్రచారం జరుగుతున్నది. అదేవిధంగా చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన భీంభరత్ వర్గీయులు కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే యాదయ్య నియోజకవర్గంలో ఎక్కడ పర్యటించినా నిరసన వ్యక్తం చేస్తూ అడ్డుకుంటున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి ఏ కార్యక్రమానికి వెళ్లినా అడ్డుకుంటుండడంతో ఎమ్మెల్యే యాదయ్య ఏమి చేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో చేరికకు రెండు రోజుల ముందు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసిన కాలె యాదయ్య.. అదే పార్టీలో చేరడంతో నియోజకవర్గ ప్రజల నుంచి సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొంది ఆరు నెలల్లోనే పార్టీ మారడంపై జిల్లా అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### శిలాఫలకం ధ్వంసం..

తాజాగా బుధవారం నవాబుపేట మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు కాంగ్రెస్ నాయకుల్లో మొదలైన వర్గపోరుతో నిలిచిపోయాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యాదయ్య హాజరుకావాల్సి ఉండగా.. స్థానిక కాంగ్రెస్ నేతలు శిలాఫలకాలను ధ్వంసం చేసి నిరసన తెలిపారు. తిమ్మారెడ్డిపల్లి, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన, సీసీ రోడ్ల ప్రారంభ కార్యక్రమానికి సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం ఎమ్మెల్యే పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఇష్టంలేదని పలువురు నేతలు బాహాటంగానే విమర్శించడం కనిపించింది. తిమ్మారెడ్డిపల్లిలో జరిగిన ఘటనపై సంబంధిత డీఈ, ఏఈ ఇద్దరూ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ డీఈ, ఏఈ చేసిన ఫిర్యాదుపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



ధ్వంసమైన శిలాఫలకం

# ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ




శంషాబాద్‌లో పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూలై 3(నమస్తే తెలంగాణ) : శంషాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శశాంక బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వైద్య సిబ్బందితో పాటు పేషెంట్లకు సంబంధించిన రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది విధులకు సరైన సమయానికి హాజరు కావాలని, ఆసుపత్రికి వచ్చే రోగులపై విసుగు చెందకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. రోగులకు అవసరమైన చికిత్స అందించి మందులు అందజేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. టెస్టులు నిర్వహించి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేతన వెతలు

- వేతనాల కోసం నెలల తరబడిగా గ్రామపంచాయతీ కార్మికుల ఎదురు చూపులు
- పంచాయతీ పాలనలో కీలక భూమిక పోషిస్తున్న కార్మికులు
- రంగారెడ్డి జిల్లాలో 3,200 మంది కార్మికులు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలు
- సమ్మెకు సిద్ధమవుతున్న కార్మికులు



**గ్రామ పంచాయతీ పాలనలో పంచాయతీ కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారిని చిన్నచూపు చూస్తున్నది. నెలల తరబడిగా వేతనాలను అందజేయకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితిలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలతోపాటు ఇతర సమస్యల పరిష్కారానికి కార్మికులు సమ్మెకు సన్నద్ధమవుతున్నారు.**

**-రంగారెడ్డి, జూలై 3 (నమస్తే తెలంగాణ)**

రంగారెడ్డి జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 3,200లకు పైగా మల్టీపర్పస్ పారిశుధ్య కార్మికులు, వాటర్ మెన్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేయడం, కలుపు మొక్కలను తొలగించడం, దోమల నివారణకు మందులు చల్లడం వంటి పనులు చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిత్యం శ్రమిస్తున్నా.. వేతనాల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్టీపర్పస్ వర్కర్‌కు గతంలో తక్కువ వేతనం ఉండగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.9,500లకు పెంచి అందజేసింది. పెండింగ్ లేకుండా గత ప్రభుత్వం విధిగా వేతనాలు అందజేసింది. కానీ.. గత ఆరునెలల కాలంలో ఆ పరిస్థితి లేదు. సిబ్బంది వేతన బకాయిల చెల్లింపు ఒక్కో పంచాయతీల్లో ఒక్కో తీరున ఉన్నది. కొన్ని పంచాయతీల్లో ఐదారు నెలలు, మరి కొన్నింటిలో మూడు, నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. కొన్ని చోట్ల వివిధ రకాల పన్నులు వసూలు చేసి జీతాలు చెల్లిస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో పన్నుల రూపేణ ఆదాయం వచ్చినా.. ఇతర పనులకు ఖర్చు అవుతుండడంతో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతున్నది. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతుండగా.. ప్రతి నెలా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు పేర్కొంటున్నారు.

### నిధుల కోసం తప్పని నిరీక్షణ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి నిధులు మంజూరు చేయకపోవడంతో పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ ఉండాలి. కానీ.. నిధులు లేక పంచాయతీలు నిస్తేజంగా మారాయి. ఇదివరకు 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నుంచి పంచాయతీలకు నిధులు వచ్చేవి. ప్రస్తుతం ఆ నిధులూ రాకపోవడంతో అటు పారిశుధ్య కార్మికుల వేతనాలను, ఇటు ట్రాక్టర్ల కిస్తీలను చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేక పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు.

### కార్మికుల సమ్మె బాట..

వేతన సమస్యలతోపాటు పలు సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు కార్మికుల సమ్మె బాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ చేయాలని కార్మికులు కోరుతున్నారు. సమాన పనికి సమాన వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని కార్మికులు కోరుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన కార్మికులు త్వరలోనే సమ్మె చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# రెండో జత ఎప్పుడో?

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఒకే జత యూనిఫాం పంపిణీ
- పాఠశాలలు ప్రారంభమై నెలరోజులవుతున్నా పంపిణీ కాని రెండో జత
- కొన్ని పాఠశాలల్లో ఒకజత కూడా అందజేయని వైనం..



బొంరాస్‌పేట, జూలై 3 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలుతో పాటు ఏడాదిలో రెండు జతల యూనిఫాంను ఉచితంగా అందచేస్తున్నది. పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా ఉండడంతో పాటు విద్యార్థుల డ్రాపౌట్‌ను తగ్గించడానికి ఇవి ఎంతో దోహదం చేస్తాయి. గత కొన్ని సంవత్సరాలుగా విద్యా సంవత్సరం ప్రారంభమైన రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీతో పాటు రెండు జతల యూనిఫాంనూ ప్రభుత్వం పంపిణీ చేస్తూ వస్తున్నది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన రెండు జతల ఉచిత యూనిఫాంకు బదులుగా ఒకే జత పంపిణీ చేసింది. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా రెండోజత యూనిఫాం ఇంకా విద్యార్థులకు పంపిణీ కాలేదు. ఒకే జత యూనిఫాంను రోజూ వేసుకుని రావాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దాన్నే ఉతుక్కుని దాన్నే వేసుకుని రావాల్సి వస్తున్నదని విద్యార్థులు వాపోతున్నారు.

### బాలురకు ఒక జత కూడా పంపిణీ కాలే

ప్రభుత్వం పంపిణీ చేసిన ఒక జత యూనిఫాం కూడా కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిగా పంపిణీ కాలేదు. ఉదాహరణకు బొంరాస్‌పేట మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలల్లోని బాలురకు నేటికి కూడా ఒకజత యూనిఫాం పంపిణీ చేయలేదు. బాలికలకు కూడా అరకొరగానే యూనిఫాం వచ్చిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. బొంరాస్‌పేట ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు సరిపడా యూనిఫాంలు రాకపోవడంతో నేటికీ విద్యార్థులకు పంపిణీ చేయలేదు. గతంలో మాదిరిగానే విద్యార్థుల యూనిఫాంను కుట్టే బాధ్యతను ప్రభుత్వం ఈ ఏడాది కూడా మహిళా సంఘాలకు అప్పగించింది. వికారాబాద్ జిల్లాలో 94 మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి యూనిఫాం కుట్టే బాధ్యతను అధికారులు అప్పగించారు. అయితే కొన్నిచోట్ల బాలురకు పంపిణీ చేసే ప్యాంట్లు కుట్టడానికి మహిళలకు రాకపోవడంతో వాటిని స్టిచ్చింగ్ కోసం వేరే వారికి ఇవ్వడం, కుట్టిన యూనిఫాంకు బటన్లు, కాజలు తదితర పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో పంపిణీకి ఆలస్యం అవుతున్నది. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మాడల్ స్కూళ్లలో చదువుతున్న 85,988 మంది విద్యార్థులకు ఒకజత యూనిఫాం పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు ఒకజత యూనిఫాం పంపిణీతో పాటు రెండోజత యూనిఫాం పంపిణీకి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఒకజతతో ఇబ్బంది : ఇందు, 3వ తరగతి బాపల్లితండా.**



ఒకేజత యూనిఫాం పంపిణీ చేశారు. రోజూ దాన్నే ఉతుక్కుని తొడుక్కు వస్తున్నాం. రెండు జతల యూనిఫాం ఉంటే ఇబ్బంది ఉండదు. ఒక్కోసారి యూనిఫాంకు బదులుగా సివిల్ డ్రెస్ వేసుకుని వస్తున్నాం.

**యూనిఫాం ఇవ్వలేదు : తరుణ్ గౌడ్, 10వ తరగతి, దుద్యాల.**



ఏటా రెండు జతల యూనిఫాం ఇచ్చేవారు. కానీ ఇప్పటి వరకు ఒక జతకూడా ఇవ్వలేదు. యూనిఫాం లేకపోవడంతో సివిల్ డ్రెస్ వేసుకుని పాఠశాలకు వస్తున్నాం. రెండు జతల యూనిఫాం ఒకేసారి ఇస్తే ఇబ్బంది లేకుండా ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

# అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

**-శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ**

వికారాబాద్,జూలై 3 : అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ సెంటర్లలో అందిస్తున్న పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక పాఠశాలలో చిన్న పిల్లలకు బోధించే పాఠ్య ప్రణాళిక, ఆటపాటలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గతంలో మాదిరిగా కాకుండా పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా పిల్లలకు ఆటలు, పాటలతో పాటు ప్రాథమిక విద్య అందించాలన్నారు. షామ్ (అతి తీవ్ర లోప పోషణ), మామ్ (తీవ్ర లోప పోషణ) పిల్లలను గుర్తించి వారికి కావాల్సిన పౌష్టికాహారం, బాలామృతాన్ని పిల్లలకు కచ్చితంగా ఇచ్చేవిధంగా చూడాలన్నారు. గ్రామాలవారీగా ఆశ, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎంలతో పాటు రాష్ట్రీయ బాల స్వాత్యా బృందాలతో కలిసి అంగవైకల్యం, బుద్ధి మాంద్యం కలిగిన పిల్లలను గుర్తించి 21 రకాల వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 1079 మంది అంగవైకల్యం కలిగిన వారిని గుర్తించి నమోదు చేసినట్లు తెలిపారు. నెల రోజుల్లో సదరం క్యాంపులను నిర్వహించి గుర్తింపు కార్డులను అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంగవైకల్యంతో కూడుకున్న వ్యక్తులకు సంబంధించి ఖాళీలను గుర్తించి రిజర్వేషన్ల ప్రాతిపదికన అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలిపారు. బుద్ధి మాంద్యం, బధిరుల సౌకర్యార్థం మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్ కేంద్రంగా బుద్ధి మాంద్యం పిల్లలకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణతో పాటు పునరావాసాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లి, శివరెడ్డి పేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్, డీసీహెచ్ఎస్ ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

# రూ.6వేల పింఛన్ అందించాలి

**దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**

రంగారెడ్డి, జూలై 3(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ వేదిక నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ రూ.300లను రూ.3వేలకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నప్పటికీ పెంచిన పింఛన్ అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆదాయ పరిమితి విధిస్తూ జారీ చేసిన జీవో నెం.17ను వెంటనే రద్దు చేయాలన్నారు. ధర్నాలో వేదిక నాయకులు భుజంగ రెడ్డి, జె.రాజు, డి.రాజశేఖర్ గౌడ్, ఎన్.శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు